# 'నా ప్రేయసి'

రచన:
ఎల్. సోబలేవ్

అనుకృతి:
ఏల్చూరి సుబ్రహ్మణ్యం

'ల్యూబా' ఆస్పత్రికి వస్తే మా ప్రాణాలు కుదటబడేవి. ఆమె వార్డులో అడుగుపెడ్తే, మమ్మల్ని వెంటాడుతున్న దయ్యాలు కొంచెం దూరంగా పోయ్యేవి. అసలు ఆమె ఎంతత్వరగా నడిచినా చప్పుడుకాదు. తెల్లటి దుస్తులు వేసుకొని ఆమెనడుస్తున్నప్పుడు, కాంతికిరణం కదుల్తున్నట్టుగా వుంటుంది. తడితడిగావున్న ఆమె గులాబి రంగుబుగ్గల మీద పడినమంచు, ముత్యాలలాగా మెరిసేది. బాధతో మూల్గే రోగులను చూస్తున్నప్పుడు, చీకటింట్లో పెట్టిన దీపం మాదిరిగా మెరిసేవి ఆమె కళ్ళు.

మావార్డులో చిట్టచివర పక్కమీద 'మేజర్' పడుకునేవాడు. అతనికి యుద్ధములో కాలువిరిగింది. 'ల్యూబా' కనిపించగానే యవ్వనంలోవున్న ఆడవాళ్ల బుగ్గలు రోజాపూలకంటే ఎక్కువగా మెరుస్తాయి అనేవాడు 'ల్యూబా' చిరునవ్వునవ్వేది మేజరు కొంచెం ఆగి, 'ల్యూబా! మేము బ్రతికి బయట పడతామా?' అని, నొసలు ప్రశ్నార్థకంలాగా చిట్లించేవాడు. 'తప్పక బ్రతుకుతావు' అని ఆమె జవాబు స్పష్టంగా చెప్పేది. గొంతుక వినసొంపుగా వుండేది. ఆసుపత్రి అన్నిదిక్కులూ 'బ్రతుకుతావు.... బ్రతుకుతావు' అని ప్రతిధ్వనించేది పాలిపోయిన శరీరాల్లో కొత్త నెత్తురు పెట్టినట్టు ఆమెమాటలు కొత్త కొత్తఊహాలు కల్పించేవి

చలికి కొంకర్లు పోతున్న ఆమె చేతివేళ్ళను, నల్లగావున్న ఆ పెద్ద పొయ్యిదగ్గర నిల్చుని కాచుకునేది మంటలు కక్కుతున్న ఆ పొయ్యిదగ్గర నిల్చుని అనేక సంగతులు చెప్తుండేది. పని ఎంతత్వరగా చేసుకుపొయ్యేదో మాటలు అంత త్వరగా మాట్లాడేది. ఆ కొద్ది మాటల్లోనే యుద్ధవార్తలూ, రోగుల ఆహారమూ, బజార్లో ధరలూ, నిన్న రాత్రి ఆమె చూచిన సినిమాలను గురించి చెప్పేది. అంతకు పూర్వం నరాలు తీసుకుంటున్న రోగులు సైతం ప్రాణం, శక్తివచ్చినట్టు కదిలేవారు. ఉత్సాహంతో కళ్ళు తెరిచేవారు. ఆమె పొయ్యిదగ్గర నిల్చుని వార్డు మొత్తం కలయచూచేది. దినచర్య నిర్ణయించుకుని క్షణంలో ఒక రోగిదగ్గర్నుంచి మరొక రోగిదగ్గరకు వచ్చేది తెల్లటి దుప్పట్లు మడతపడకుండా కప్పేసి డాక్టరు అవసరం అనుకున్న రోగుల దగ్గరకు డాక్టర్ను పిల్చుకొచ్చేది. రోగుల జుట్టు సవరించేటప్పుడూ, ముఖాలు

కుట్రం చేసేటప్పుడూ ఒక్క బొట్టు సీరైనా దిండుమీద చిందకుండా చేసేది. ఉత్తరాలు రాసుకోలేని వాళ్ళకు ఉత్తరాలు రాసిపెట్టేది. మృత్యువుతో క్షణ క్షణమూ సమరం సాగిస్తున్న మాకు, అలసటా, బాధా యెంతో వుంటుంది. గాయపడిన మాకు యెంతో సున్నితంగా ధైర్యంచెప్పి ప్రాణం పోసేది. మెత్తటి ఆమె అరిచేతులతో బాధను తీసేసేది శాంతంగా అందరికీ నిద్రపట్టేదాకా ఆమె పనిచేసేది

మాకు ఆమె అంటే ప్రాణంగా వుండేది. పూలపాన్పులాంటి ఆమె హృదయంలో మా అందరికీ చోటు యిచ్చేది. మాలో ఒకరొకరికి అసూయ లేదు. కత్తులబోనులాంటి మృత్యువు. కరకు హస్తాలలో చిక్కుపడ్డ మేము యెవర్నిచూచి అసూయపడతాము ?

ఆమె ఎవరిపక్కమీదనన్నా ఎక్కువ సేపు కూర్చుని మాట్లాడిందంటే, ఆరోజు అతను మరీ కుంగిపోయినా డన్నమాట అతనికి ఆమె ప్రాణం పోస్తున్నదను కోవాలి

ఇవ్వాళ ఆమె నామంచంమీద వచ్చి కూర్చుంది. రాత్రి అంతా నాకు నిద్రపట్ట లేదు ఈ కథకు సంబంధించని విష యాలు యెన్నో నన్ను బాధించాయి. ఉదయం ఆమె నన్నుచూచి నవ్వగానే, ఎక్కడో లేనినవ్వు, అతికష్టంమీద తెచ్చుకుని ఆమెకు స్వాగతమిచ్చాను. ఇంత చిన్నతనంలోనే ఆమెకు పక్కవాడి బాధ తెలుసుకోగలిగిన శక్తి ఎక్కడ నుంచి వచ్చిందా అని ఆశ్చర్యంకలిగేది. ఆమె నాదగ్గరకు వచ్చేటప్పుడు యెన్నో జాబులు పట్టుకొచ్చింది, చాలాసేపు నాతో ఉత్సాహంగానే మాట్లాడింది,

కానీ, ఆమె రోజూ నవ్వినట్టు నవ్వ లేదు ఆమె నీలికళ్ళల్లో దైన్యం అలము కొన్నది. ఆమె ఎంతో పెద్దదైనట్టు యివ్వాళ కనిపించింది ఆమె జాబులు తెల్లటి బల్లమీద దుఃఖకరంగాపడివున్నై. ఆమెబాధ యేమిటని మాలో గుసగుసలు బయల్దేరాయి.

ఆమె భర్త టాంకుదళాల్లో పనిచేసే వాడట. అతని సాహస కృత్యాలకు వాటి రెండు పతకాలుకూడా వచ్చా యిట అయితే - యిప్పుడాయన ఒక నెలనుంచీ కనిపించటంలేదు. ఈ నెల అంతా ఆమె బాధను దిగమింగి, మాకు ఉత్సాహాన్ని ఇస్తూనేఉంది. యెంత అప్రమత్తతతో ఆమె పనిచేస్తున్నా, ఆమె కళ్ళల్లో, ముఖంలో దైన్యం తాండ విస్తున్నది రాత్రిళ్ళు ఆమె బాధతో ఏడ్చేది. స్నేహితులను లేపి మాట్లా డేది కాదు. యివ్వాళ ఆమె సాయంత్రం సెలవు తీసుకున్నది. టాంకుదళాలలో పనిచేస్తున్న ఒక ఉన్నతోద్యోగి (ఆమె భర్త స్నేహితుడి) దగ్గరకు వెళ్ళింది.

ఆ అధికారి ఆమె చేతులు పట్టుకుని ఓదార్చాడు. నేను నిజం చెప్తున్నాను. 'పావెల్' శత్రువులకు చిక్కివుంటాడు. అందరూ తప్పించుకుని వచ్చారు, పావెల్ యింకా రాలేదు

అగ్నిపర్వతం పగులుతున్నట్టు ఆమె గుండెలు దడదడ లాడుతున్నై ముఖం కొయ్యబారి ఆమె ప్రతిమలాగా నిలుచు న్నది. అధికారి 'నువ్వు యిట్లా అధైర్య పడకూడదు, పావెల్ తప్పక వస్తాడు.

ఎప్పుడు వస్తాడో అందాకా నువ్వు నిరీక్షిస్తుండాలి. ఇట్లా ఎదురుచూస్తూ వుండటం కష్టమే. ఓర్పు వహించాలి' నువ్వు యెప్పుడు ఎదురుచూస్తూ వుండనక్కర్లేదో నేను చెప్తాను' అన్నాడు.

బాధతో కుంగిన ఆమెను చూచేసరికి నా బాధ మరచిపోయాను పురుషుణ్ణి కావటంవల్లా, నా గుండెల్లో మెత్తటి మాటలు లేకపోవటంవల్లా ఆమెకు ఉపశమనం కలిగించేటట్లు మాట్లాడలేక వూరుకున్నాను. నిరాశలో సైతం ఆమె మాకు యెన్ని ఆశలు కల్పించేది.

కాళ్ళు కండెలు కట్టి మేజర్ బాధతో గుంజుకుంటున్నాడు. నీళ్ళల్లో రాయి వేస్తే వలయాలు వలయాలుగా రాతి చుట్టూ నీళ్ళు తిరుగుతై అట్లాగే విరిగిన కాలుదగ్గర ఆరంభమైన నొప్పితో మేజర్ ఉంగరాలు తిరుగుతున్నాడు? తన్నుకుంటున్న మేజర్ను చూచేసరికి, ఆమెబాధ యెటుపోయిందో? ఆ చిన్నతనంలోనే ఆమె పడుతున్న కష్టాన్ని మేము ఊహించుకోలేక పోయినాము. అంతశక్తిమాకులేదు!

తర్వాత నన్ను యింకో వార్డులోకి మార్చారు వారం గడిచింది. వారం గడిచాక, మళ్ళీ నావార్డులోకి వచ్చాను పాతస్నేహితులు ఎవరూలేరు. కొత్తగా గాయపడ్డవాళ్ళు వచ్చారు,

సామంచం పక్కనే కదలికలేకుండా వొళ్ళంతా కట్లతో పడివున్న మనిషి కనిపించాడు. అంతా గాజుగుడ్డతో చేసిన బొమ్మలాగా వున్నాడు ఆకట్లమనిషి!

ఇతను, టాంకు దళాలలో పనిచేసే సైనికుడు, రొమ్ము, ముఖమూ, అంతా కాలిపోయింది జుట్టూ, కనుబొమలూ, నొసలూ-అంతేకాదు. మానవ శరీరం మీద కాలిపోయ్యేది యేదివుందోఅదంతా కాలిపోయింది. అతని కళ్ళకు మాత్రం అదృష్టవశాత్తు నల్లటికళ్ళ జోడువుంది. అది రెప్పలనూ, గుడ్లనూ రక్షిస్తూ, కట్లనూ అతన్ని వేరుచేస్తున్నది. తెల్లటి కట్టూ, ఉబికినట్లున్న అనల్లటికళ్ళద్దాలూ చూస్తే, కాలిచల్లారినకొండలాగావుంది.

కళ్ళద్దాలక్రిందిగా కట్టుకు ఒక చిన్న చిల్లి ఉంది ఈ చిల్లిలోనించి మాటలు వినిపిస్తున్నై. ఆ కాలినమనిషికీ ప్రపంచానికీ యిదే సంబంధం. సైనికుడి వొళ్ళంతా సూదులతో పొడిచినట్టుంది. నరనరంలో మంటలు యింకా మండుతూనేవున్నై. కట్లు మార్చినప్పుడల్లా ఆయన నరకయాతన పడాలి. ఈ బాధ అతను భరిస్తున్నాడు. అతనికి బ్రతకాలని కోరికవుంది. బ్రతికి మళ్ళీ శత్రువులను చెండాడుతాడట ఈ కోర్కెతో అతను బ్రతికి బాధపడుతున్నాడు. కట్టుకట్టినా నాలుకమాట్లాడుతున్నది. అతనికి మాట్లాడాలని ఎంతో వుంది. మంటలమధ్య అతను సృష్టించుకున్న ప్రపంచంలో నుంచి అతని మాటలు 'యెవరు వింటారా' అని చూస్తున్నాడు. కట్లలోనుంచి వస్తున్న మాటలు, అస్పష్టంగా చిత్రంగా వున్నై. గాయపడినవారి వాక్యాలు తెగిపోయిన గొలుసుల లాగావుంటై. ధైర్యం, ద్వేషం చావుల సంరంభాలను అవిప్రతిధ్వనిస్తై. అబ్బా! ...ఇరవైరెండోయేడైనా నిండని యువకుడు, తన కలల్ని కట్లలోనుంచి చెప్పాలని పోరాడుతున్నాడు. ఈ రాత్రి

మా యిద్దర్నీ ఒకచోటికి తెచ్చింది. జబ్బులూ, యుద్ధాలు........ త్వరగా స్నేహం కలుపుతాయేమో !

తెలతెలవారకముందే నేను నిద్ర లేచాను. వార్డులో గాలి వెచ్చగా వుంది. రోగుల....పురుషుల ఉఛ్వాసనిశ్వాసాలతో వేడెక్కిన గాలి ఘాటుగావుంది. ఈ శబ్దాన్ని కోస్తున్నట్టు మధ్య మధ్య మూలుగు వినిపిస్తున్నది. ఆ మూలుగు వినవస్తున్నవైపు. 'తెల్లటి మనిషి' యెవరూ పోకపోవడంవల్ల యింకా 'ల్యూబా' రాలేదనుకున్నా. ఆమె రానట్టుంది. 'ఫెన్యా' వుందేమో వార్డులో. ఆమె నడివయస్సులో వుంది. త్వరగా అలసిపొయ్యేది రాత్రికళ్ళుపొయ్యేముందు వేసివున్న కుర్చీలో నిద్ర పోతుంది. నేను బయటికి వెళ్ళి సిగరెట్ కాల్చుకుందామనుకున్నాను ఇంతలో టాంకు సైనికుడు 'దాహం' అన్నాడు.'ఫెన్యాను' లేపుదామనుకున్నాను

అతను : 'వద్దు, మీరివ్వండి ఫరవాలేదు '

నేను జాగ్రత్తగా మంచినీళ్ళుపోశాను. యెంతో జాగ్రత్తగా పోసినప్పటికీ కట్టుమీదపడ్డై. నామనస్సు నొచ్చుకుంది. క్షమించమన్నాను. 'దీనికేనా?—' అతను నవ్వాడు. మాటమాటకూ మధ్యవచ్చిన వ్యవధి నవ్వు అనుకోవాలి. 'ఆమె మంచినీళ్లు పోసినట్టైయితే మనం తాగినట్టే వుంటుంది' అన్నాడు.

నేను : 'ఆమె ఎవరు ?'

అతను : 'నా ప్రేయసి—'

మనస్సు విప్పి నాకు అతని ప్రేమ గాథ చెప్పటం మొదలుపెట్టాడు ఆయన యిదివరలో చూడని, ముందు చూడటానికి వీల్లేని స్త్రీనిగురించి మాట్లాడుతున్నాడు ప్రతివాక్యమూ 'నాప్రేయసి' అనటంతో ఆరంభిస్తున్నాడు. సున్నితంగా ఆమె అతని చెయ్యి పట్టుకున్నప్పుడే అతను ప్రేమించాడట' అతను పేరు చెప్పలేదు. పైగా కొన్ని మాటలు పలకలేదు. నేను 'ల్యూబా' అనుకున్నాను! ఆమె సంగతిచెప్తున్నప్పుడల్లా వీరుడిలాగా గర్వంగా మాట్లాడేవాడు ఉద్వేగంవల్ల కొంత చెప్పలేక బాధ పడుతున్నాడు.

ఆమె కళ్ళు, కొనతేరి చెక్కినట్టున్న ముక్కు, పట్టులాగావున్న ముంగురులను వర్ణించాడు రాత్రి ఆమె ధర్మామీటరు వెతుకుతున్నప్పుడు, చేత్తో నిమిరి చూచాడట ఆమె చెయ్యి, వేళ్లు మెత్తగావున్నాయట స్పర్శవల్లనే ఆమె యెంతో జాగ్రత్త గలిగిన వ్యక్తి అని నిర్ణయించుకున్నాడు. యుద్ధాల్లోమంటల్లో నుంచి వచ్చిన ఆయోధుడికి ముందు ముందు ఆమె ఆధారమట.

ఆమె అతన్ని యెట్లా ఓదార్చిందీ, యేమేమి చెప్పిందీ పూసగుచ్చినట్టు వరసగా చెప్పాడు. యింత సుఖం యివ్వగలిగిన వ్యక్తి 'ల్యూబా' కాకపోతే మరెవరు?

ఆయన పేరుచెప్పడు. తిన్నగా రేపు డాక్టరు నాకళ్ళకు జోడు తీస్తాడు. నేను ఆమెను చూస్తాను. నేను రేపు ఆమెను చూస్తానని, ఆమెకు చెప్పలేదు. అయినా ఆమెను నేను చూడక్కర్లేదు కూడా.

ఆమె అందగత్తె. ఆమె కళ్ళల్లో ప్రేమ తొణికిసలాడుతుంది' అన్నాడు.

రేపు ఆమె అతనికి, ఒక శస్త్ర చికిత్స చేయించే విషయం కనుక్కొని చెప్తానందిట దాన్తో కనుబొమలూ, ఇది వరకటి చర్మం, రంగూ అన్నీవస్తాయిట. దీనికోసం ఎంత బాధనైనా ఓర్చుకుంటాడట. ఇదంతా 'ప్రేయసికోసం' అన్నాడు 'నాప్రేయసి' అని గర్వంగా చేతులు రొమ్ముమీద పెట్టుకోబోయినాడు కట్ల వల్ల ఆప్రయత్నం విఫలమైంది.

ఇంకా ఆమె సంగతిచెప్తూనేవున్నాడు. తనకు యుద్ధంలో ముఖం పోయిందట. ఆమెకుప్రియుడుపోయినాడట దీర్ఘంగా గడచిన రాత్రి వాళ్ళు ఒకరొక్కరు అర్థం చేసుకుని మాట్లాడుకున్నారట. మృత్యువు శాసించే యీ ఆస్పత్రి ఆవరణలో, ప్రేమ తన అమృత హస్తం చాచింది వెన్నెల విరిసి, కనుల పండువుగా కురిసినట్టుంది.

అనేకసార్లు సైనికుడు తన్నుతానే కాల్చుకోవాలనుకున్నాడట ఇకముందు అతనికి అలాంటి దుర్దశ రాదట. యెంత వికారంగావున్నా శత్రువులను ఓడించి, ప్రేయసితో సుఖమయ జీవితం గడుపుతాడట, ఎట్లాగో ?—యిప్పుడు కాలి, కాలుస్తున్న బాధ యెట్లావున్నా అతను కొత్తగా వున్నాడు. భవిష్యత్తు ఆశాజనకంగా, ఇంద్రధనుస్సులాగా అతని మనోవీధులలో వంపులు తిరిగింది.

'నీ ముఖం, అందం యెట్లావున్నా పరవాలేదు. నీకోసం నిన్ను ప్రేమిస్తున్నాను. ముందు ప్రేమిస్తాను' అని చెప్పిందట ప్రియురాలు-

కొంచెంసేపు యేమీ మాట్లాడలేదు. ఏడుస్తున్నాడు ఏమీపుకాదు. అతను పొంగుతున్న సంతోషాన్ని పట్టలేకుండా వున్నాడు. అతని హృదయం చెలియలి కట్టను తెంచుకుని పొర్లిన ఏరల్లేవుంది

అతన్ని పడుకోమని, నేనువచ్చి పడుకున్నాను నా మనస్సు 'ల్యూబా' సంగతి ఆలోచించటం మొదలుపెట్టింది చిత్రంగా ఆమె జీవితంలో వస్తున్న మార్పును ఊహించలేకుండా ఉన్నాను. ప్రేమా ?—యిది జాలివల్ల బాధితునికి చేస్తున్న పరోపకారమా ? లేక అతని దుఃఖాన్ని ఆమె పంచుకుంటున్నదేమో! తన ప్రియుడివంటి మరొక సైనికునికి, ఒక వీరుడికి సాయం చేస్తున్నదేమో! బాగా తెల్లవారిన తర్వాత ఆమె రాగానే యెట్లావుంటుందో. ఆమె కళ్ళల్లో యీ ప్రశ్నలకు కాదు - సంశయాలకు సమాధానం దొరుకుతుందేమో వెతకాలనిపించింది.

నాకు భారంగా నిద్రపట్టింది. ఎండ ఎక్కిన తర్వాత మెలుకువ వచ్చింది. నర్సులు మారినట్టున్నారు. 'ల్యూబా' రాలేదు. టాంకు సైనికుడి దగ్గర కెళ్ళి ఆమె రాలేదన్నాను

'మంచిది......... ఆమె నావిషయం నా కట్టు విషయం కనుక్కోటానికి వెళ్ళింది. ఇవ్వాళ ఆమెను నేనుచూస్తాను కదూ !' అన్నాడు

అతను మాట్లాడుతున్నదాన్ని బట్టి నేను చిరునవ్వు నవ్వుతున్నాడనుకున్నాను.

'నిజంగా అందగత్తెఅంటే....ఆమె కదూ !—నీకు తెలియదూ ?' అన్నాడు.

'నిజంగా ఆమె చాలా చక్కనిది!' నేను జవాబు చెప్పాను.

యివ్వాళ ఆమెను తను యెట్లా చూడగలుగుతాడో చెప్తూ మధ్యలో మాట్లాడటం మానేశాడు. కట్లు చెవులకు అడ్డంగావున్నా మెత్తటి అడుగుల చప్పుడు వింటున్నాడు.

'ఆమె వస్తున్నది.. నా ప్రేయసి!' అన్నాడు.

నేను తలయెత్తిచూచాను. 'ల్యూబా' కాదు. 'ఫెన్యా వస్తున్నది. అతను పొరపడుతున్నాడని తెలుసుకునే టందుకు వస్తున్న 'ఫెన్యాను' పిలిచి స్వాగతం చెప్పాను. అక్కడినుంచి పొయ్యి దగ్గరవున్న ఫెన్యాదగ్గరకెళ్ళి 'ల్యూబా' సంగతి అడిగాను.

ఫెన్యా: 'ల్యూబా యివ్వాళరాదు. ఆమె భర్త యుద్ధంలో గాయపడి తిరిగి వచ్చాడట. అక్కడికి వెళ్ళింది'

నేను: 'ల్యూబా భర్తవచ్చాడా?'

ఫెన్యా; 'అవును'

పొయ్యిదగ్గిర్నుంచి ఫెన్యావెళ్ళి సైనికుడి మంచం మీద కూర్చుంది సైనికుణ్ణి సంబోధిస్తూ 'కోల్యా! నువ్వు ధైర్యంగా వుండాలి. నీకు మళ్ళీ కట్టు కట్టాలి' అని చెప్పింది.

వణకుతూ అతను చెయ్యి అందించాడు. మృత్యువునూ, శత్రువులనూ ధిక్కరించిన ఆ వీరుడి చెయ్యి ఫెన్యా పట్టుకుంది. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. నల్లటి కళ్ళద్దాల వెనుక జ్యోతులలాగా వున్న అతని కళ్ళల్లోకి చూచింది. తన కన్నీళ్ళు అతనిమీద పడకుండా ముఖం అటువైపు తిప్పుకుంది రోజూ చూసే ఫెన్యాను ఇవ్వాళ చూచాను. కొత్తగావుంది. వయస్సు మీరినా ఆమె ముఖంలో యవ్వనం కళ-కలాడు తున్నది ఆశ జాలి ఆమె కళ్ళల్లో గూడుకట్టుకున్నట్టున్నై.

'నా.. ? యేమిటి మందు వేసినట్టున్నావు?' అన్నాడు అతను. ఫెన్యా అతనికి ధైర్యంచెప్పి. ఇంకా పనిఉందన్నది. ఆమె కళ్ళు అతని బాధను చూడలేకుండా వున్నై. అతన్ని పక్కనేవున్న రబ్బరు గాళ్ళ బండిమీద పడుకోబెట్టి ప్రత్యేక చికిత్సకు తీసుకెళ్తున్నారు. ఫెన్యా అతని చేయపట్టుకుని వెళ్తున్నది ఫెన్యాలో మాతృత్వం పెల్లుబికినట్టుంది. నేనుకూడా ఆమెతోపాటు కట్టుకట్టే గది దగ్గరకు వెళ్ళాను.

ఆమె గది వాకిలిదాకా వచ్చి ఆగిపోయింది. ఆమె వాలిన తీగలాగా గది తలుపువైపు ముఖం తిప్పి ఏడుస్తున్నది. ఆమె అతని బాధను ఊహించుకుంది దుర్భరంగా.

నేను ఆమె భుజంమీద చెయ్యివేసి 'భయపడవద్దు' అన్నాను.

ఆమె 'డాక్టరుచెప్పాడు. .డాక్టరు...' అంటూ ఏడుస్తూ మాట్లాడలేకపోయింది

నేను: 'నాకు తెలుసు. నువ్వు ఊహించుకున్న బాధ నాకు తెలుసు ధైర్యంగావుండు. అతన్నిబ్రతికించాలి,

ఆమె బాధతో తలవూపింది. కళ్ళు నీళ్ళతోనిండి వొత్తులలాగా వున్నై.

'ఇవ్వాళఆయననన్నుచూస్తాడు. నేను ఆయనఅనుకున్నంత అందంగాఉంటానా

అంత అందంగా.... నేనా? అతని ప్రేయసి అందగత్తె!' అంటూ ఏడుస్తున్నది. ఫెన్నీ ముఖం తలుపుకు ఆనించి చేతులు అడ్డం పెట్టుకున్నది

లోపలినుంచి డాక్టరు మాటలు విని పిస్తున్నై. సైనికుడితో 'ఒకవారం రోజులు నువ్వు యింకా యీకళ్ళజోడు పెట్టుకోవాలి నీకు నయమై పోతుంది' అన్నాడు.

యీ మాటలు వింటున్న ఫెన్నీ ముఖం వివర్ణమై పోయింది ఎండు టాకులాగా ఆమె మనస్సు కొట్టుక లాడింది. ఆమె అప్పుడే మెట్లు దిగి పోయింది.

మళ్ళీ ఆమెను ఆస్పత్రిలో యెవరూ చూడలేదు. అతని కోసం అతన్ని ప్రేమించి బ్రతికించిన సుందరికీ, అతని స్వప్నసౌధాలకూ భంగం కలిగించ కుండా వుండటానికని-పాపం, ఫెన్నీ ఉద్యోగం వదలుకుని స్వగ్రామంలో వుంటున్నదట!

★


మహోదయ : : ప్రచురణలు

●

శ్రీ తెన్నేటి సూరిగారి రచనలు :

1. "నాగాణి" (నాటకము) 1-8-0
2. విప్లవరేఖలు (కథలసంపుటి) 0-12-0
3. అరుణరేఖలు (గేయములు) 0-10-0

శ్రీ వి. డి. ప్రసాదరావుగారి రచన :

4. బికారి (నవల-త్వరలోవస్తోంది)

వ్యాపార వివరములకు :—

రాధేశ్యామ్ ఏజన్సీస్,
సోల్ ఏజంట్సు - మహోదయ ప్రచురణలు
గవర్నరుపేట-బెజవాడ

'ఏమిమగవాళ్ళు!'
(నాటికా సంపుటి)

●

రచయిత :
శ్రీ పి. వి. రాజమన్నారుగారు

●

నేటి మన సాంఘిక జీవితాన్ని కళ్లకు గట్టేచక్కని నాటికలు....
సమాభ్యుదయానికి ఒక్కొక్క నాటికా, ఒక్కొక్క సందేశం....
జీవితంలోని రసవద్ఘట్టాలు.... జీవితానికి గుణపాఠాలు ...

వెల : ముప్పావులా

ప్రతులకు :
ఆంధ్ర అభ్యుదయరచయితలసంఘం
గవర్నరు పేట, బెజవాడ.